క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం ఆవిష్కరించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనపై 200 గ్రామాల్లో సమావేశాలు, సైకిల్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారం, జానప్రదర్శనలు చేపడుతూ చైతన్యం కల్పించనున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఎంహెచ్‌వో జీవనరాణి, డీఎల్‌వో రాణి తదితరులు పాల్గొన్నారు.

‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీ

విజయనగరం టౌన్: నగరంలో మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ సోమవారం సాయంత్రం నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులంతా జాతీయ జెండాలు చేతపట్టుకుని, కళాశాల నుంచి కోట జంక్షన్ మీదుగా తిరిగి కళాశాల చేరుకునేలా ర్యాలీ చేపట్టారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 12న ఉదయం 8 గంటలకు రంగోళి పోటీలు కళాశాల ఆవరణలో నిర్వహిస్తామని, సాయంత్రం 5 గంటలకు కళాశాల కచేరీ మందిరంలో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. 13న సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 15న జెండా వందనం కార్యక్రమం ఉంటుందన్నారు. కళాశాల విద్యార్థులు, సిబ్బంది అంతా ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉద్యోగులను చైతన్యపరచాలి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఉద్యోగులను వారి సమస్యల పరిష్కారం కోసం వారే పోరాడేలా చైతన్యపరచాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ కోరారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో ‘రండి టీ తాగుతూ మట్లాడుకుందాం’ కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణే ఏపీజీఈఏ లక్ష్యమన్నారు. ప్రతి ఉద్యోగి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజిప్రాణిగ్రాహి, సంయుక్త కార్యదర్శి జక్కపు ఉమామహేష్, జిల్లా కార్యదర్శి బలివాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

విజయనగరం గంటస్తంభం: ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ దగ్గరున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు బి.శంకరరావు పాల్గొని, కాసేపు మాట్లాడారు. బీజేపీ పాలకులు తమ రహస్య అజెండాలో భాగంగా రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ అడ్డదారిలో అధికారం చేపట్టడానికి అప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. బీహార్‌లో ఎన్నికలకు ముందే బీజేపీకి మేలు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ పేరిట ప్రతిపక్షాలకు చెందిన 64 లక్షల ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తూ ముసాయిదా తయారు చేయడాన్ని తప్పుబడుతున్నామన్నారు. ఇదే విషయమై 9 నుంచి 11వ తేదీ వరకు దేశవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అప్పలరాజు, గిరిప్రసాద్, సత్యారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

డెంకాడ: నులిపురుగు నివారణ దినోత్సవం పురస్కరించుకుని, మంగళవారం నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనూష తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన వారందరికీ ఈ మాత్రలు వేయాలని, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని అందివ్వడం జరుగుతుందన్నారు.

పూసపాటిరేగ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగు నివారణ దినోత్సవ ఏర్పాట్లను జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి అచ్చుతవల్లి సోమవారం పరిశీలించారు. మంగళవారం జరిగే డీవార్మింగ్ మాత్రల పంపిణీలో ఏడాది వయసు నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని తెలిపారు.

ఎన్నిక ఏకగ్రీవం

నెల్లిమర్ల: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కెల్ల చిన్నం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా బొమ్మన ఈశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా నల్లా సోమరాజులు ఎన్నికయ్యారు. ఈ మేరకు వారికి మిగతా సభ్యులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం

విజయనగరం: జిల్లా హోటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నగరంలో సోమవారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడు పీఎస్ఎన్ రావు(వాసు), కార్యదర్శి కాళ్ల సునీల్‌కుమార్, కోశాధికారి గ్రంధి చైతన్య, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మట్టిమేలు తలపెడదాం!



మట్టి వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు

- వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు
- ఊపందుకున్న విగ్రహాల తయారీ, విక్రయాలు
- పీవోపీ ప్రతిమలతో పొంచి ఉన్న ముప్పు
- మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

విజయనగరం: వినాయక చవితి ఉత్సవాలకు అందరూ సన్నద్ధమవుతున్నారు. మండపం ఏర్పాటు దగ్గర నుంచి విగ్రహాల ఏర్పాటు, పూజల వరకు ఇలా ప్రతి దానిలో తమదే పైచేయి కావాలనే రీతిలో నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ) విగ్రహాలకు బదులు మట్టి వినాయక విగ్రహాలను వాడి, పర్యావరణానికి మేలు జరిగేలా చూడాలని పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. ఈ నెల 27వ తేదీన ప్రారంభమయ్యే ఈ వేడుకలను ఎంతో అట్టహాసంగా చేసుకునేందుకు యువత పోటీ పడుతుంటారు. ఎవరెంత ఎత్తు విగ్రహం పెట్టి, ఎన్ని ఎక్కువ రోజుల పాటు ఉత్సవం చేస్తారో వారే గొప్ప అనుకునేలా ఈ పండగ చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుంటారు. ఈ క్రమంలో మట్టి వినాయక విగ్రహాల వాడకంపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ప్రచారాలు తక్కువయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా అవగాహన కల్పించినా కొంతమంది మట్టి విగ్రహాలను కాదని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలనే వాడేందుకు మొగ్గు చూపిస్తుండడం గమనార్హం. ఏది ఏమైనా మట్టి ప్రతిమలను వాడితేనే పర్యావరణం కలుషితం కాదని, భవిష్యత్ తరాల మనుగడ కూడా సాధ్యమవుతుందని పర్యావరణ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

మట్టి ప్రతిమలే మంచివి..

మట్టి విగ్రహాలే మంచివి, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన ప్రతిమలే గణపతి ఉత్సవాల్లో వినియోగించాలి. అవే పర్యావరణానికి మేలు చేస్తాయి. మట్టి పరమపవిత్రం. మంచికి, చెడుకు మట్టినే వాడుతాం కనుక మట్టితో చేసిన విగ్రహాలను వాడితే వాటిని నీటిలో విడిచిపెట్టినప్పుడు సులభంగా కరిగిపోతాయి. తద్వారా కాలుష్యం ఏర్పడదు.

– కామేశ్వర శర్మ, వేద పండితులు

అవగాహన చర్యలేవీ?

గణపతి నవరాత్రి ఉత్సవాలు మరికొన్ని రోజుల్లో ఆరంభం కానున్నా ఎక్కడా అవగాహన చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. విగ్రహాల తయారీ దగ్గర నుంచే ఈ చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడంలో ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టి విగ్రహాల వాడకంపై అవగాహన కల్పించకపోవడంతోనే పీవోపీ విగ్రహాల తయారీ, విక్రయాలు జోరుగా జరిగిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం విగ్రహాల కొనుగోళ్లు జరిగిపోతోందని, ఇప్పుడు తూతూ మంత్రంగా అవగాహన కల్పిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సరిగ్గా పండగకు రెండు, మూడు రోజుల ముందు మట్టి విగ్రహాలు వాడాలని అవగాహన కల్పిస్తే సరికాదని, విగ్రహాల తయారీ దగ్గర నుంచే ఇటువంటి ప్రచారం ఉంటే మెరుగైన ఫలితాలు ఉంటాయి కదా అని సూచిస్తున్నారు.

పీవోపీతో సమస్యలిలా..

పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో తయారు చేసిన విగ్రహాలు వినియోగిస్తే ఏం జరుగుతుందోన్న విషయం ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి. జిప్సం(కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్) నుంచి పీవోపీని తయా రు చేస్తారు. ఇది నీటిలో కరిగితే కాలుష్యం ఏర్పడి జీవరాశులు చనిపోతాయి. నీటి సహజ గుణాన్ని కూడా దెబ్బతీస్తుంది. విగ్రహాల తయారీకి పీవోపీ తో పాటు వీటికి వాడే రంగుల్లో పాదరసం, సీసం, క్రోమియం వంటి లోహాలను కలుపుతారు. ఇలాంటి విగ్రహాలు నీటిలోనే కాదు నేలలోకీ చేరి అనేక రకాల వ్యాధులకు కారణమవుతున్నాయి. గాలి, నీరు, భూమి కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఈ విగ్రహాల వాడకం విరమించుకోకపోతే భవిష్యత్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.

మట్టితో మేలిదే..

మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడితే పర్యావరణానికి చాలామంచిది. నిమజ్జనం సమయంలో వీటిని నీటిలో వేసినా నీరు కలుషితం కాదు. అందులో జీవులకు ఎటువంటి హాని ఉండదు. సులభంగా నీటిలో కరిగిపోతుంది. ఇదే మట్టి నేలలోకి చేరినా నేలకు కూడా ఎటువంటి నష్టం ఉండదు. ఇదే(మట్టి ప్రతిమల వాడకం) కొనసాగితే భవిష్యత్ తరాలకు బంగారు భవిత అందించినవారమవుతామని పర్యావరణ శాస్త్రవేత్తలు సలహా ఇస్తున్నారు.

‘ఉచిత బస్సు’లోనూ మహిళలకు మోసమే..



మాట్లాడుతున్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి

- విజయనగరం కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి

విజయనగరం: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని, ఇప్పుడు ఉచిత బస్సు హామీని కూడా తూతూమంత్రంగా అమలు చేసి మహిళలకు దగా చేసేందుకు సిద్ధమయ్యారని విజయనగరం కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి విమర్శించారు. ఇదే విషయమై నగరంలోని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలు కన్నా రెండింతలు ఎక్కువ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. కనీసం సూపర్ సిక్స్ హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేని దుస్థితిలో చంద్రబాబు సర్కారు ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు ఇచ్చిన ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలేవీ పూర్తిస్థాయిలో అమలు జరగలేదన్నారు. చాలామంది లబ్ధిదారులకు పథకాల లబ్ధి చేకూరలేదన్నారు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పథకాలు ఇచ్చారన్నారు. ఎన్నికలప్పుడు ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తున్నారని, ఇప్పటివరకు కొంతమంది ఖాతాల్లో గ్యాస్ డబ్బులు జమకాలేదన్నారు.

అన్ని బస్సుల్లోనూ అవకాశమివ్వాలి..

తల్లికి వందనం కింద మొదట ప్రతి పిల్లవానికి రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని చెప్పి, ఇప్పుడు ఒకరికి రూ.13 వేలు, మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.9 వేలు వేశారని ఇది కాదా మోసం చేయడం అని ప్రశ్నించారు. ఇప్పుడు అమలు చేస్తామని చెబుతున్న ఉచిత బస్సు పథకంలోనూ మోసమే దాగి ఉందన్నారు. అన్ని రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం ఇవ్వకుండా షరతులు పెడుతున్నారని దుయ్యబట్టారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో బస్సులకు మాత్రమే పథకం పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికలప్పుడు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికి అయినా ఏ బస్సులో అయినా ప్రయాణం చేయవచ్చని హామీ ఇచ్చి, ఇప్పుడు కొన్ని బస్సుల్లోనే ప్రయాణించాలని చెబుతుండడం మోసం కాదా అని నిలదీశారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 6 వేల బస్సుల్లో మాత్రమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే తక్కువ బస్సులు ఉన్నాయని, కొత్త బస్సులు కొనుగోలు చేసి, మహిళలకు అన్ని బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్‌లు ఆల్తి సత్యకుమార్, పిన్నింటి కళావతి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చుకోండి



కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

విజయనగరం అర్బన్: మా పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించుకోవాలని గుర్ల మండలం, గుజ్జింగివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా జిల్లా కేంద్రంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ పిల్లలు అదే పాఠశాలలో చదివి తొమ్మిదో తరగతి నుంచి పదో తరగతికి ప్రమోట్ అయ్యారని అయితే వారి కాండక్ట్‌పై ప్రధానోపాధ్యాయులు అసంతృప్తి చెంది ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే టీసీ(ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్)లు ఇచ్చి పాఠశాల నుంచి పంపించేశారని వాపోయారు. సమీప పాఠశాలలో చేరేందుకు వెళ్లినా వారు చేర్చుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్.. విద్యార్థులకు టీసీలు ఇవ్వడంపై పూర్తి వివరాలను తెలుసుకోవాలని డీఈవో యు.మాణిక్యంనాయుడును ఆదేశించారు. వారు ఎక్కడ చదువుతామంటే అక్కడి పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఏపీఎంఎస్ జేడీ తాహిరా సుల్తానా

భోగాపురం: విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏపీఎంఎస్ జేడీ తాహిరా సుల్తానా సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలను సోమవారం సందర్శించిన ఆమె.. అనంతరం ఏడు జిల్లాల ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు పెంపొందించాలని తెలిపారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది భవిష్యత్‌లో ఉత్తమ జీవనం జీవించేలా ప్రోత్సహించాలన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన కొయ్య హరీష్.. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సకుర ప్రోగ్రాం..కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, బాగా చదువుకుని తల్లిదండ్రులకు, చదువుకుంటున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, ఎంఈవో చంద్రమౌళి, ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గురువులను సత్కరించుకోవడం మన సనాతన ధర్మం



వేదికపై సన్మాన గ్రహీత రాళ్లపల్లి రామసుబ్బారావు

విజయనగరం టౌన్: గురువులను సత్కరించుకోవడం మన సనాతన ధర్మమని ఆధ్యాత్మిక భక్త మండలి అధ్యక్షుడు సిద్ధనాథం చలపతిరావు అన్నారు. విఖనస జయంతి పురస్కరించుకుని, స్థానిక శంకర కల్యాణ మండపం ఆవరణలో శ్రీవేంకటేశ్వర ఆధ్యాత్మిక భక్త మండలి ఆధ్వర్యంలో పురాణ కోవిద, ప్రవచన శిరోమణి బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావు, వైఖానస ఆగమ పండితులు పాణంగపల్లి కుమారస్వామిలను నిర్వాహకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలను పరిరక్షించేందుకు కీలకపాత్ర పోషిస్తున్న గురువులను ఈ విధంగా గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గుప్తా, కోశాధికారి జనార్దనరావు, అర్చకులు నరసింహాచార్యులు, సరిపల్లి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్



నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేటలో ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

డెంకాడ: మండలంలోని నాతవలస గ్రామంలో పోలీసులు సోమవారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఎస్ఐ సన్యాసినాయుడు తమ సిబ్బందితో కలిసి తెల్లవారుజామున గ్రామానికి వెళ్లి, తనిఖీలు చేశారు. మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండడం, మద్యం అమ్మకాలు వంటి వాటిపై సోదాలు చేశారు. చట్టవిరుద్ధమైన పనులేవీ ఎవరూ చేయకూడదని, ఎవరైనా ఆ పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

నెల్లిమర్ల రూరల్: ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే ఇచ్చేయాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. మండలంలోని కొండవెలగాడ, సీతారామునిపేట గ్రామాల్లో జరిగిన కార్డెన్ సెర్చ్‌లో సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు నాటు తుపాకుల ఏరివేతకు అనుమానిత ప్రదేశాల్లో సోదాలు చేస్తున్నామని, లైసెన్స్ లేని తుపాకులు ఉన్నా, నాటు తుపాకులుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ దృష్టికి కార్మికుల సమస్యలు

నెల్లిమర్ల: ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు దృష్టికి నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ సమస్యలను తీసుకువెళ్లారు. స్థానిక నగరపంచాయతీ ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో బంగార్రాజును కలిసిన కార్మికులు.. తమకు మిల్లు యాజమాన్యం చెల్లించాల్సిన గ్రాట్యుటీ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మోసకారి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



ముడిదాంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’లో విజయనగరం మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి



36వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న మోసకారి కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుదామని విజయనగరం మేయర్, డిప్యూటీ మేయర్‌లు వెంపడాపు విజయలక్ష్మి, కోలగట్ల శ్రావణి అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక 36వ డివిజన్, మజ్జిపేటలో సోమవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. ఎన్నికలప్పుడు అనేకానేక హామీలిచ్చి ఓట్లు దండుకుని, తీరా అధికారంలోకి వచ్చాక అవేవీ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. హామీల అమలులో జరుగుతున్న జాప్యంతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అప్పుడు లాగా ఇప్పుడు ఎందుకు హామీలు అమలు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రజల అవసరం ఉన్నంతవరకు వారికి లేనిపోని మాటలు చెప్పి నమ్మించడం తర్వాత వారిని మోసం చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు అని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఎప్పుడిస్తారని నిలదీశారు. అధికారం దిగిపోయే ముందు ఇవన్నీ ఇచ్చి చేతులు దులిపే ప్రయత్నం చేస్తే అప్పటివరకు ప్రజలు చూస్తూ ఊరుకోరని, తిరగబడతారని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని అప్పటివరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలి పద్మావతి, మహిళా నాయకులు ఉషారాణి, అనూష, జ్యోతి, సుజాత, నందిని, ప్రశాంతి, సౌజన్య, పరమేశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

నిలదీస్తేనే పథకాల అమలు..

విజయనగరం మండలం, ముడిదాం గ్రామంలో సర్పంచ్ చిట్టి సన్యాసప్పడు ఆధ్వర్యంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, జిల్లా ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు డోల మన్మధకుమార్‌లు పాల్గొని, కూటమి మోసపూరిత పాలనను ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా ఎన్నికల హామీలన్నీ అమలు చేయ డం జరగలేదని, అటు పాలనలోను ఇటు సంక్షేమ పథకాల అమలులోనూ కూటమి ప్రభుత్వ విఫలమైందన్నారు. ఇప్పుడు మనం ప్రశ్నించకుంటే భవిష్యత్‌లో ఏ ఒక్క పథకాన్ని అమలు చేయరని చైతన్యం కల్పించారు. ఎన్నికల హామీ ప్రతిఒక్కటి నెరవేరేలా సీఎం చంద్రబాబును నిలదీయాలని, లేకుంటే హామీలు అమలు జరగదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల సూర్యప్రకాశరావు, మండల బీసీ విభాగం అధ్యక్షుడు ఆల్తి రవి, వైస్ సర్పంచ్ కోరాడ సత్యనారాయణ, ఎం.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని వైద్య కళాశాలకు తరలించండి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పౌరవేదిక సంఘం అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలలోకి తరలించాలని జిల్లా పౌరవేదిక సంఘం అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఇదే విషయమై ఆయన ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా జ్వరాల బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, చికిత్స కోసం సర్వజన ఆస్పత్రికి వచ్చి అక్కడ పరిస్థితి చూసి రోగులు వెనుదిరుగుతున్నారని తెలిపారు. 70 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన ప్రదేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఉందని, అక్కడకి ఆస్పత్రిని మారిస్తే వైద్యసేవలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆయన వెంట పౌరవేదిక నాయకులు రామచంద్రరాజు, ప్రభాకర్‌రావు, రామ్మోహన్‌రావు, కొండబాబు తదితరులు ఉన్నారు.

అవార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

విజయనగరం టౌన్: విశాఖపట్నంలోని దాబా గార్డెన్స్‌లో ఉన్న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 14వ తేదీన కళా సంబరాలు నిర్వహిస్తున్నట్లు దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు పీఏ భాస్కరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో నిస్వార్థ సేవలందించిన వారిని విశాఖ రత్న అవార్డులతో సన్మానిస్తామని, అర్హులంతా అవార్డుల కోసం వారి సేవలు వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9848481767ను సంప్రదించాలని ఆయన కోరారు.

బీసీ రక్షణ చట్టం చేయండి

విజయనగరం టౌన్: తక్షణమే బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక కేఎల్ పురం యూత్ హాస్టల్‌లో సోమవారం మాట్లాడారు. దేశంలో 56 శాతం బీసీలున్నారని, వారి పట్ల, వారి భద్రతా చర్యల పట్ల సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఓబీసీ క్రిమిలేయర్ తీసివేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. అనంతరం జిల్లా శాఖ ప్రతినిధులుగా ఎంపికైన రవి, దేముడులకు నియామక పత్రాలు అందజేశారు.